# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-07-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1)** **ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా- గోదావరి జలాలకు జలహారతి ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**2)** **ఆయుష్ రంగాన్ని బలోపేతం చేసేందుకు 350 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామన్న మంత్రి వై.సత్యకుమార్ యాదవ్.**

**3)** **రాయలసీమలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపిన పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్.**

**4)** **రాష్ట్రాన్ని వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న పురపాలశాఖ మంత్రి పొంగూరు నారాయణ.**

==========================

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా-గోదావరి జలాల పవిత్ర సంగమం వద్ద నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. కృష్ణా గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించారు. అనంతరం జలహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, స్థానిక శాసన సభ్యులు వసంత కృష్ణప్రసాద్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్...27 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో ఆయుష్ రంగాన్ని బలోపేతం చేసేందుకు 350 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఔషధ మొక్కల స్థిరమైన సాగు, ఆర్థిక వృద్ధి, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ, 280 కోట్ల రూపాయలతో నాలుగు కొత్త ఆయుష్ వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 15 వందలకు పైగా ఆయుష్ డిస్పెన్సరీలను ఆధునీకరించినట్లు వెల్లడించారు. అశ్వగంధ, మునగాకు, ఉసిరి వంటి ఔషధ మొక్కల సాగు, మార్కెటింగ్, ఎగుమతులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలం చిన్నకొమర్లలో 3,478 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న సిమెంట్ ప్లాంట్ విస్తరణ నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్‌తో కలిసి ఈ రోజు శంకుస్థాపన చేశారు. దాల్మియా సిమెంట్స్ చైర్మన్ పునీత్ యదు దాల్మియాతో కలిసి భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో టిజి భరత్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వైఎస్సార్ కడప జిల్లా, రాయలసీమలో పెద్ద ఎత్తున్న పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉపాధి అవకాశాలను విస్తరిస్తున్నట్లు మంత్రి తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రాన్ని వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పురపాలశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దంతాలలో నిర్మిస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పనులను అధికారులతో కలిసి మంత్రి ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 300 కోట్ల రూపాయల వ్యయంతోఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గుంటూరు, విశాఖపట్నంలోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో రోజుకు 2,800 టన్నుల చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

---------------------------

అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైనవారికి ముఖ్యమంత్రి సహాయనిధి-సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెంలోని క్యాంపు కార్యాలయంలో అత్యవసర శస్త్రచికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ప్రభుత్వం మంజూరు చేసే హామీ పత్రం-ఎల్ఓసీలను లబ్ధిదారులకు మంత్రి ఈరోజు అందజేశారు.

---------------------------

కేంద్ర పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "స్వచ్ఛత పక్వాడ" కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి సురేష్ గోపీ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థులు తమ సృజనాత్మకతను చిత్రలేఖనం ద్వారా అద్భుతంగా ప్రతిబింబించి పతకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల ఆత్మవిశ్వాసం, ప్రతిభ అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

---------------------------

భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం-సీఈటీఏ, సామాజిక భద్రతా ఒప్పందం ఈరోజు నుంచి అమల్లోకి వచ్చాయి. సీఈటీఏతో భారతీయ ఉత్పత్తులకు యునైటెడ్ కింగ్‌డమ్ మార్కెట్‌లో సుంకం లేని ప్రవేశం లభించనుంది. సామాజిక భద్రతా ఒప్పందం ద్వారా యునైటెడ్ కింగ్‌డమ్‌లో తాత్కాలికంగా పనిచేసే అర్హులైన భారతీయ నిపుణులకు సామాజిక భద్రతా చెల్లింపుల నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ ఒప్పందం భారత

వాణిజ్య చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని, రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత విస్తరించేందుకు దోహదపడుతుందని తెలిపారు.

---------------------------

దేశ నీటి పారుదల రంగానికి కె.ఎల్.రావు చేసిన సేవలు చిరస్మరణీయమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. డాక్టర్ కె.ఎల్.రావు 125వ జయంతి సందర్భంగా విజయవాడలోని ఆయన సమాధి వద్ద మంత్రి ఈ రోజు నివాళులర్పించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలతో నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నామని తెలిపారు. హీరాకుడ్, శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి కీలక బహుళార్థ సాధక ప్రాజెక్టుల రూపకల్పనలో కె.ఎల్.రావు విశిష్ట పాత్ర పోషించారని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

భారత సైన్యంలో అగ్నివీర్, రెగ్యులర్ విభాగాల నియామకాల కోసం నిర్వహించిన ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష – సీఈఈ ఫలితాలను విడుదల చేసినట్లు గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి కల్నల్ రజత్ సువర్ణ ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులు సంబంధిత రిక్రూట్‌మెంట్ ర్యాలీలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, శారీరక దారుఢ్య పరీక్షలు, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ర్యాలీ నోటిఫికేషన్‌ను జాగ్రత్తగా చదివి, అన్ని ధృవపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. భారత సైన్య నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

---------------------------

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 17న పల్నాడుజిల్లా నరసరావుపేటలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా భారీ రుణమేళా కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. సుమారు 30 వేల మంది లబ్ధిదారులు పాల్గొనే ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, ఆక్వా ఫీడ్ ధరల పెరుగుదల, ఉత్పత్తి వ్యయాలు, విద్యుత్ ఛార్జీలు, ఎగుమతులకు సంబంధించిన ఇబ్బందులపై రైతులతో చర్చించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

---------------------------

తిరుమలకు సంబంధించిన నకిలీ వెబ్‌సైట్లు, మధ్యవర్తుల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి సూచించారు. తిరుమలలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆన్‌లైన్ దర్శన టికెట్లు, వసతి గదుల బుకింగ్‌లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చేసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని తెలిపారు. దర్శన టికెట్లు, వసతి గదుల వివరాల కోసం టీటీడీ కాల్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇదిలా ఉండగా, తిరుమలలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆక్టోపస్, పోలీసు, విజిలెన్స్ విభాగాల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. పీఏసీ-4లో జరిగిన ఈ విన్యాసాల్లో ఉగ్రవాదుల దాడి ప్రయత్నాలను భద్రతా బలగాలు ఎలా ఎదుర్కొంటాయో ప్రదర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో చేపట్టే రక్షణ చర్యలపై భక్తులకు అవగాహన కల్పించారు.

======================